కొమురవెల్లి మండల

విద్యాశాఖలో విభేదాలు!

- వివాదాస్పదమైన ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ కార్యక్రమం
- ఎంఈవోకు సమాచారమివ్వకుండానే విద్యాశాఖ డైరెక్టర్‌కు ఆహ్వానం

8



సిద్దిపేటలో ర్యాలీలో నిర్వహిస్తున్న దృశ్యం

న్యాయవ్యవస్థలో బాలికలకు ప్రత్యేక చట్టాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి
- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి

సిద్దిపేటక్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలల రక్షణకు పటిష్ఠమైన చట్టాలతో పాటు బాలలకు ప్రత్యేక హక్కులను కూడా భారత రాజ్యాంగం కల్పించిందని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ప్రారంభమై పురవీధుల గుండా కొనసాగి తిరిగి కోర్టు ప్రాంగణంలో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల బాలికలకు ఎలాంటి ఉచిత న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థను సంప్రదించాలని సూచించారు. బాలికలను శారీరకంగా, మానసికంగా హింసకు గురిచేసిన వారిని శిక్షించేందుకు పటిష్ఠమైన చట్టాలు అమలులో ఉన్నాయని ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు న్యా య విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ర్యాలీ లో పాల్గొన్న విద్యార్థినులకు పండ్లు, బిస్కెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మిలింద్ కాంబ్లీ, చందన, తరుణి, న్యాయవాదులు ప్రకాష్, రవీందర్ పాల్గొన్నారు.

లెక్క తేల్చడమే తరువాయి

- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు 2,30,483.. ఇప్పటి వరకు 1,12,390 మందిని అర్హులుగా గుర్తింపు!
- వ్యవసాయ యోగ్యం కాని భూమి 13,119.33 ఎకరాలు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 17 వేల దరఖాస్తులు
- జిల్లాలో ముగిసిన గ్రామ, వార్డుసభలు
- చివరి రోజూ కొనసాగిన వాగ్వాదాలు
- జాబితాలో పేరు రాలేదని దుబ్బాకలో సెల్‌టవర్ ఎక్కిన యువకుడు
- నేడు పూర్తిస్థాయి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్న అధికారులు



నారాయణరావుపేట మండలంలో జాబితాలోని పేర్లపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు



దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు రాలేదంటూ సెల్ టవర్ ఎక్కిన యువకుడు

సిద్దిపేట టౌన్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్రామ, వార్డు సభలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా నాలుగురోజుల పాటు జరిగిన సభలు నిలదీతలు, నిరసనలు, బహిష్కరణ, వాగ్వాదాల మ ధ్య కొనసాగాయి. చివరి రోజు కూడా అక్కడక్కడ వాగ్వా దాలు, నిలదీతలతో జరిగినా.. మిగితా చోట్ల సజావుగానే ముగిశాయి.

సంక్షేమ పథకాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు

ఇది వరకే అందించిన దరఖాస్తుల విషయమై జిల్లా వ్యాప్తంగా అధికారులు గ్రామ, వార్డుసభల్లో జాబితాలో వచ్చిన పేర్లు చదివి వినిపించారు. అయితే, ఎంపికైన జాబితాలో తమ పేర్లు రాలేవంటూ అధికారులను ప్రజలు పలుచోట్ల నిలదీయగా, తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ, వార్డు సభలలో పలు సంక్షేమ పథకాల కోసం వెల్లువలా దరఖాస్తులు రావడంతో వాటిని అధికారులు స్వీకరించారు. తద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏయే పథకానికి ఎన్ని దరఖాస్తులో వచ్చాయో లెక్క తీసి, వాటినిఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిసింది. వీటిలో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల కోసం వచ్చినట్లు సమాచారం.

26 నుంచి అమలుకానున్న పథకాలు

ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, రైతు భరోసా పథకాలను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. అయితే కొద్ది సమయం మాత్రమే ఉండటంతో నియోజకవర్గాల వారీగా అర్హులను ఎంపిక చేసే ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. అందుకు ఎక్కడ కూడా పైరవీలకు తావివ్వకుండా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తున్నారు. ప్రాధాన్యం క్రమంలో ఏ పథకాన్ని ముందుగా ఇస్తారు? ఎవరిని అర్హులుగా ప్రకటిస్తారోనన్న గుబులు దరఖాస్తు చేసుకున్న ఆశవాహుల్లో కనిపిస్తున్నది.

జిల్లా వ్యాప్తంగా..

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 514 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల్లో 115 వార్డులున్నాయి. ఈ నెల 21 నుంచి ఈ నెల 24 వరకు జిల్లా అధికారులు బృందాలుగా విడిపోయి గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డులో సభలను నిర్వహించారు. ప్రజాపాలనలో భాగంగా జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,30,483 దరఖాస్తులు రాగా 1,12,390 అర్హులుగా అధికారులు గుర్తించారు. రైతు భరోసా పథకం కింద గతంలో 5.55 లక్షల ఎకరాలున్న వ్యవసాయ భూముల్లో, పథకానికి సంబంధించి వచ్చిన నిబంధనల ప్రకారం వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, లే అవుట్లు తదితరమైనవి 13,119.33 ఎకరాలను పనికిరాని భూమిగా అధికారులు గుర్తించినట్లు సమాచారం. వ్యవసాయ కూలీలకు ఇస్తామని చెప్పిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి శుక్రవారం సాయంత్రం వరకు 17 వేలకు పైగానే దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

మిగతా 8వ పేజీలో..

గాంధీజీ చూపిన మార్గంలో

అభివృద్ధిని సాధిద్దాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ చూపిన శాంతియుత మార్గంలో అభివృద్ధిని సాధిద్దామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ఆయన హుస్నాబాద్‌లో గాంధీ విగ్రహాన్ని, పట్టణంలోని చావడి వద్ద సుందరీకరణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. హుస్నాబాద్‌లోని నాలుగు జంక్షన్లను రూ.2 కోట్లతో సుందరీకరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 26 లోపు హుస్నాబాద్‌కు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, ఉపాధి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. తాను ఎక్కడికెళ్లినా నియోజకవర్గ అభివృద్ధిపైనే ధ్యాస ఉంటుందన్నారు. కొత్తపల్లి-హుస్నాబాద్ ఫోర్‌లైన్ నిర్మాణాన్ని పట్టణం గుండా నిర్మాణం చేస్తే భవనాలు తొలగించాల్సి వస్తుందని ఆసుపత్రి నుంచి నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, దొడ్డి శ్రీనివాస్, బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత, వాల సుప్రజ, చిత్తారి పద్మ, జనగామ రత్న, గోవిందు రవి, వల్లపు రాజు, సరోజన, హరీశ్ తదితరులున్నారు.



గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

- కొందరు రెచ్చగొట్టడంతోనే పరిస్థితి చేయిదాటింది : మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

పటాన్‌చెరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు దాడి చేసిన ఘటనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌తో కలిసి సందర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఘటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్దంగా నిరసనలు తెలుసుకునే అవకాశం అందరికీ ఉంటుందని, ఆందోళనలు హింసాత్మక ఘటనలకు దారితీస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిన్న కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలుపుతున్న క్రమంలో కొందరు నాయకులు రెచ్చగొట్టడంతోనే హఠాత్తుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంవైపు పరిగెత్తారని తెలిపారు. ఈ ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఘటన తీవ్రం కాకుండా పోలీసులు సకాలంలో స్పందించారని పేర్కొన్నారు. ఆందోళనలు, నిరసనలు తెలిపే సందర్భాల్లో నాయకులు సంయమనం పాటించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ తెలిపారు. పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గతేడాది స్టేషన్ పరిధిలో 18 దోపిడీలు జరిగితే ఇందులో 17 కేసులు ఛేదించామని తెలిపారు. బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, ఉత్తర్‌ప్రదేశ్ తదితర వలస కార్మికులు రావడం వల్ల జరిగిన నేరాలు, బాలికలపై జరిగిన లైంగికదాడులపై ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఐదారు పోక్సో ఎస్‌బీడబ్ల్యులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రియల్‌ఎస్టేట్ పేరుతో నేరాలు, ల్యాండ్‌గ్రాబింగ్, డబుల్‌రిజిస్ట్రేషన్లు, బౌన్సర్లను పెట్టుకుని భయపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

317 స్పౌజ్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ పూర్తి

సిద్దిపేట కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 317 జీవో బాధిత స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలో స్పౌజ్ ఉపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు శుక్రవారం కౌన్సెలింగ్ చేపట్టారు. జిల్లాలో 99 ఖాళీలకు గానూ 73 మందికి స్పౌజ్ కేటగిరిలో కేటాయింపు చేశారు. వీరికి ఆఫ్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం పోస్టులను కేటాయించారు. ఈ ప్రక్రియలో జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఏడీ వేంకటేశ్వర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి

- డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్

సిద్దిపేట టౌన్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరూ ఆరునెలలకోసారి తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలని జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. శుక్రవారం సిద్దిపేటలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్ ఆధ్వర్యంలో జార్జ్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్, కమ్యూనిటీ హెల్త్ సిస్టం ఇన్నోవేషన్ పరిశోధనకు సంబంధించిన జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు నెలలకోసారి ముఖ్యంగా బీపీ, షుగర్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పరీక్షలు నిర్వహించేందుకు అన్నీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాపోలు రామకృష్ణ, దినేష్, కీర్తి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీకళ, డాక్టర్ రేవతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి

సీపీఎం రాష్ట్ర మహాసభలు

- తొలిసారి వేదికైన సంగారెడ్డి.. ముమ్మరంగా ఏర్పాట్లు
- నేటి బహిరంగసభకు బృందాకారత్, రాఘవులు, తమ్మినేని
- రేపు, ఎల్లుండి ప్రతినిధుల సభలు, చర్చలు
- 28న సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గం ఎన్నిక



సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభల నిర్వహణకు స్వాగత ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 24: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మహాసభలకు తొలిసారిగా సంగారెడ్డి జిల్లా కేంద్రం వేదికైంది. నేటి నుంచి 28వ తేదీ వరకు అట్టహాసంగా సభలను నిర్వహించడానికి జిల్లా బాధ్యులు సమాయత్తమయ్యారు. మహాసభల నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి సీపీఎం శ్రేణులు ఎర్రని దండులా కదలిరానున్నారు. నేడు సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీతో రాష్ట్ర మహాసభలకు శ్రీకారం చుట్టబోతున్నారు.

కదిలొస్తున్న ఎర్రదండు

నాలుగు రోజులపాటు జరిగే సీపీఎం మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలిరానున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 4వ సారి జరిగే మహాసభలకు సంగారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోంది. సభలకు వచ్చే అతిథులు, ప్రతినిధులు, ఇతర నేతలకు వసతి, బస కూడా ఏర్పాటు చేశారు. నేడు ఉదయం పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి బహిరంగ సభ నిర్వహించే పీఎస్ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. బహిరంగ సభకు భారీగా జనసమీకరణ చేపట్టారు. సభకు కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కారత్, బీవీరాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారు. 26న జరిగే ప్రతినిధుల సభకు సీపీఎం జాతీయ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ హాజరవుతున్నారు. 27న పార్టీ కార్యచరణ, సాగించిన పోరాటాలపై చర్చ వేదికలు కొనసాగించనున్నారు. ఇక ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారుల ఆటపాటలు, కళారూపాల ప్రదర్శనలు అదనపు ఆకర్షణగా నిలవనున్నాయి.

రాష్ట్ర కార్యవర్గంపై ఆసక్తి

సంగారెడ్డి కేంద్రంగానే సీపీఎం పార్టీ రాష్ట్ర నూతన కార్యదర్శితోపాటు కార్యవర్గాన్ని ఈనెల 28వ తేదీన ఎన్నుకుంటారు. ప్రస్తుతం తమ్మినేటి వీరభద్రం కార్యదర్శిగా ఉన్నారు. ఆయన స్థానంలో కొత్త కార్యదర్శి ఎవరైతారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మహాసభల చివరిరోజు నివేదిక సమర్పిస్తారు. అనంతరం పార్టీ ప్రతినిధులు రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కార్యదర్శిని ఎన్నుకునే ప్రక్రియతో మహాసభలు ముగుస్తాయి. కాగా మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లా బాధ్యులు శ్రమిస్తున్నారు. ఈ సభల నేపథ్యంలోనే గురు, శుక్రవారాల్లో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కళాకారులు ప్రదర్శనలు చేపట్టారు. ప్రముఖ కళాకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న తన గాత్రంతో అలరించారు. సంగారెడ్డి చుట్టూ పరిశ్రమలు విస్తరించి ఉండడంతో కార్మిక వర్గాల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. జనసందోహం నడుమ సభలను సక్సెస్ చేసేలా ప్రయత్నిస్తున్నారు.

స్కాన్ అండ్ లర్న్

- పదోతరగతి విద్యార్థులకు హరీశ్‌రావు గిఫ్ట్
- డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీకి శ్రీకారం
- స్కూల్లో స్పెషల్ స్టడీ.. ఇంట్లో డిజిటల్ స్టడీ

సిద్దిపేటకల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లాను ముందువరుసలో నిలబెట్టేందుకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీరావు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సంవత్సరం కూడా బెస్ట్ రిజల్ట్ టార్గెట్‌గా అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, తల్లిదండ్రులను సూచనలిస్తూ, విద్యార్థులు ముందుకెళ్లేలా మోటివేట్ చేస్తూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.పిల్లలను బాగా చదివించాలని వారి తల్లిదండ్రులకు ఉత్తరాలు రాశారు. ఆ తర్వాత స్వయాన పేరెంట్స్‌కు ఫోన్ చేసి సమాచారం తెలసుకుని, సలహాలందించారు. ప్రస్తుతం విద్యార్థులను మరింతగా చదువుకు చేరువ చేసి మంచి ఫలితాలు రాబట్టేందుకు మరో కార్యక్రమం చేపట్టనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ అందజేయనున్నారు.

విద్యార్థులకు అడ్వాన్స్ గిఫ్ట్

ప్రస్తుతం యువతరం మొబైల్ వాడకం, డిజిటల్ వినియోగం పెరిగిపోయింది. ఆ అలవాటును కూడా విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా డిజిటల్ కంటెంట్ రూపంలో జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేయనున్నారు. ఈ డిజిటల్ కంటెంట్ బుక్స్ గత ఏడాది కూడా విద్యార్థులకు హరీశ్‌రావు అందజేశారు. మంచి ఫలితాలు రావడంతో మరోసారి కూడా అదే తరహాలో డిజిటల్ కంటెంట్ బుక్స్ అందజేయనున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలోని 2500 మంది విద్యార్థులకు అందజేయనున్నారు.

స్కాన్ చేస్తే..

కేసీఆర్ డిజిటల్ కంటెంట్, టీహెచ్‌ఆర్ గిఫ్ట్ అనే పేరుతో డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను రెండు సంవత్సరాలుగా హరీశ్‌రావు విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రత్యేక తరగతులు పాఠశాలలో చదివితే, ఇంట్లో ఉండి చదివేలా వారి మేధస్సు పదును పడేలా డిజిటల్ స్టడీ ఉపయోగపడుతుంది. ఈ డిజిటల్ కంటెంట్ బుక్స్‌లో పాఠ్యాంశాల వారిగా క్యూఆర్ కోడ్ ఉంటుంది. సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన సమాచారం కోసం సెల్‌ఫోన్, ట్యాబ్ ద్వారా స్కాన్ చేస్తే చాలు దానికి సంబంధించిన ఆడియో, వీడియోలు స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతాయి. దాన్ని బట్టి విద్యార్థులు నేర్చుకుంటే చాలా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కొత్త వస్తువు ఏదైనా విద్యార్థికి ఉత్సాహన్నిస్తుందంటారు. అలాగే వీటివల్ల విద్యార్థులకు చాలా మేలు కలిగే అవకాశముంది. త్వరలోనే పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించనున్నారు. అన్ని రకాలుగా విద్యార్థులను ప్రోత్సహించి చదువులో ముందుండేలా చూస్తున్నారు. వెరసి జిల్లాను అగ్రభాగాన నిలిచేలా హరీశ్‌రావు ప్రణాళికలు చేస్తున్నారు.



డిజిటల్ కంటెంట్ బుక్స్‌తో విద్యార్థులు (ఫైల్)



కడవేరుగులో బతుకమ్మ చీరల డంప్

బతుకమ్మ పండుగ సందర్భంగా గత ప్రభుత్వం మహిళలకు కానుకగా చీరలు అందజేసింది. చేర్యాల మండలం కడవేరుగులో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల వాటిని ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి కొద్దిపాటి చీరలే సరఫరా చేసినప్పటికీ పూర్తిస్థాయిలో అందించకపోవడంతో అలానే ఉండిపోయాయి. బ్యాగులలో భద్రపరిచి జీపీ కార్యాలయంలో మూలనపడేయడంతో దుమ్ము, ధూళితో పాడైపోతున్నాయి.

\- చేర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డిలో నేడు పాలకవర్గ చివరి సమావేశం

- రేపటితో ముగియనున్న మున్సిపల్ కౌన్సిల్ పాలన
- ఐదేళ్లలో రూ.60.49కోట్లతో అభివృద్ధి
- ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్

సంగారెడ్డి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గం శనివారం చివరిసారిగా సమావేశం కానున్నది. నేడు ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పాలక వర్గాల పాలన రేపటితో ముగియనున్నది. 2020 జనవరి 27న ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన కౌన్సిల్ సభ్యులు ఈనెల 26 నుంచి నిష్క్రమించనున్నారు. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల పదవీ కాలం ముగియనున్నది. మూడు దఫాలుగా సంగారెడ్డి మున్సిపాలిటీకి హ్యాట్రిక్ ఛైర్‌పర్సన్‌గా బొంగుల విజయలక్ష్మి కొనసాగుతున్నారు. ఐదేళ్లుగా పాలకవర్గం వివిధ అభివృద్ధి పనులను చేపట్టగా, గ్రూపు తగాదాలు నెలకొన్నాయి. సొంత పార్టీ నేతలే ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టగా కోరం సభ్యులు లేక వీగిపోయింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో ఛైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు.

642 పనులు పూర్తి

సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ పరిధిలో ఐదేళ్ల పాలనలో రూ.60.49 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలోని 38వ వార్డుల్లో మురుగు కాల్వలు, రోడ్లు, విద్యుదీకరణ, తాగునీరు తదితర పనులు పూర్తి చేశారు. 2019 నుంచి 2025 వరకు వివిధ స్కీంల ద్వారా మొత్తం 1097 పనులకుగానూ రూ.60.49 కోట్లతో 642 పనులు పూర్తి చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఐదేళ్లల్లో పట్టణ ప్రగతి కింద రూ.15.95 కోట్లతో 357 పనులు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.52 కోట్లు, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం కింద రూ.53 లక్షలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.1.30 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.61 కోట్లు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.22.35 కోట్లు, ఎన్‌సీపీ నిధుల నుంచి రూ.3.06 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ కింద రూ.9.15 కోట్లతో పలు పనులనే చేపట్టారు.

15 ఏళ్ల పాలన సంతృప్తినిచ్చింది



నేను సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేయడం సంతృప్తిగా ఉంది. సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా మూడు పర్యాయాలు.. 15 ఏళ్ల పాటు పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. పట్టణ ప్రగతి బాటలో భాగస్వామిని కావడం ప్రజలు ఇచ్చిన అవకాశంగా, పట్టణ అభివృద్ధి కోసం సహకరించిన తోటి కౌన్సిలర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులందరికీ ధన్యవాదాలు.


- బొంగుల విజయలక్ష్మి, మున్సిపల్ ఛైర్‌పర్సన్



SUPER HIT నేడే చూడండి




SUPER HIT నేడే చూడండి



SUPER HIT నేడే చూడండి



SANKRANTI BLOCKBUSTER
విజయవంతమైన 3వ వారం



BLOCKBUSTER HUNTING
విజయవంతమైన 2వ వారం



BLOCKBUSTER PONGALU
విజయవంతమైన 2వ వారం





శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ ఆకుపై భారతదేశం, బ్యాలెట్ నమూనా, ఓటు హక్కు చిత్రాలను మలిచారు.

- నారాయణఖేడ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి)

జోగిపేట ఏరియా ఆస్పత్రిలో
మందుబాబు హల్‌చల్

గడ్డిమందు తాగివచ్చానని వైద్యం అందించలేదని ఆరోపణ

జోగిపేట, జనవరి24 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఓ మందుబాబు హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే.. పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాలకు చెందిన మొగులాన(మౌలానా) గురువారం రాత్రి జోగిపేట ఏరియా ఆస్పత్రికి వచ్చాడు. కుటుంబ తగాదాలతో గడ్డిమందు తాగానని, తనకు వైద్యం చేయాలని హడావిడి చేశాడు. వైద్యం చేసేందుకు డాక్టర్లు నిరాకరించినట్లు అతడి బంధువు ఆరోపిస్తున్నారు. అయితే, మొగులాన మద్యం సేవించి వచ్చాడని, దీంతో మొదటగా అతడు ఏమి తాగారో తెలియలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య పేర్కొన్నారు. ప్రథమ చికిత్స చేసిన తరువాత మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశామని ఆమె వివరించారు.

సంగారెడ్డి విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో పురస్కారాలు



మార్షల్ ఆర్ట్స్ పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థి విశ్వేశ్వర్

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో అత్యుత్తమ పురస్కారాలు దక్కాయి. హైదరాబాద్‌లోని బిర్లామందిర్ సైన్స్ మ్యూజియంలో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎం.రిత్విక్, ఎం.విశ్వేశ్వర్ ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారాలు అందుకున్నారు. దేశ నలుమూలలతో పాటు 14 దేశాల నుంచి మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఇంతటి ఉత్తమ పురస్కారాలు విద్యార్థులకు దక్కడం పట్ల శిక్షకుడు పోచయ్య, తల్లిదండ్రులు, క్రీడాకారులను పలువురు అభినందించారు.

అమీన్‌పూర్‌లో ఆక్రమణలపై సమగ్ర సర్వే..!

కాలనీలవాసులు ఆందోళన చెందొద్దు : హైడ్రా

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు లే అవుట్లలో పార్కులు, ఖాళీ స్థలాలు, రహదారుల ఆక్రమణలపై సమగ్ర సర్వే నిర్వహించనున్నట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కొన్ని లే అవుట్ల యజమానులు హైడ్రా సర్వే అంటూ స్థానికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి అవాస్తవ ప్రచారం నమ్మొద్దని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. అమీన్‌పూర్‌లోని గోల్డెన్ కీ వెంచర్స్ యజమాన్యం తమ ప్లాట్లు ఆక్రమించారని వెంకటరమణ కాలనీవాసులు గతంలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పరిసర ప్రాంతాల్లోని ఇతర కాలనీల వాసులు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్ల క్రితం సర్వే నంబర్ 152, 153లోని వెంకటరమణ కాలనీ పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్టు క్షేత్రస్థాయి సర్వేలో నిర్ధారించారు. కాలనీలోకి చొరబడి గోల్డెన్ కీ వెంచర్స్ ఆక్రమణలకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై మరింత లోతైన సర్వే చేయించేందుకు హైడ్రా సిద్ధమైంది. సర్వే ఆఫ్ ఇండియా, ఏడీ సర్వే విభాగంతో కలిసి సంయుక్తంగా సర్వే చేయాలని భావిస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని ఫిర్యాదులందిన కాలనీలు, లే అవుట్లలో సమగ్ర సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అందరి సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని, స్థానికులు భాగస్వాములు కావాలని రంగనాథ్ కోరారు. పలు ఆరోపణల నేపథ్యంలో గోల్డెన్ కీ సంస్థ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. ఆర్టీసీ కాలనీ, రంగారావు వెంచర్, చక్రపురి కాలనీ వాసులు కూడా కబ్జాలుంటే ఫిర్యాదు చేయాలని, సమగ్ర సర్వేలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని కాలనీలవాసులు ఆందోళన చెందాల్సిన పని లేదని, హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

బిల్లు కట్టలేదని కరెంటు కట్

ట్రాన్స్‌కో ఏఈతో లక్ష్మాపూర్ గ్రామస్థుల వాగ్వాదం

రామాయంపేట, జనవరి 24 ఆంధ్రజ్యోతి) : బిల్లు బకాయి కట్టడం లేదంటూ కనెక్షన్ తొలగించగా.. మీటర్ ధ్వంసం చేశారంటూ గ్రామస్థులు ట్రాన్స్‌కో అధికారితో వాగ్వాదానికి దిగిన ఘటన శుక్రవారం రామాయంపేట సబ్‌స్టేషన్‌లో జరిగింది. మండల పరిధి లక్ష్మాపూర్‌లో గురువారం బిల్లుల వసూలుకు వెళ్లిన ట్రాన్స్‌కో సిబ్బంది బకాయి ఉన్న పలువురి ఇళ్లల్లోని కనెక్షన్‌ను కట్ చేశారు. దీంతో రాత్రంతా అంధకారంలో ఉన్నామని.. పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడిందని గొడవపడ్డారు. అయితే మీటర్ ధ్వంసం చేయాల్సిన అవసరం తనకు లేదని అధికారి వివరణ ఇచ్చినా వినకపోవడంతో తిరిగి కొత్త మీటర్ బిగించడంతో సమస్య సద్దుమణిగింది.

మెదక్ చర్చిలో ఐక్యతా ప్రార్థనలు

మెదక్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మెదక్ సీఎస్ఐ చర్చిలో శుక్రవారం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో ఐక్యతా ప్రార్థన నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని సంఘాలకు చెందిన పాస్టర్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్స్, శాంతయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు పట్టుకుని ప్రార్థనలో పాల్గొన్న చర్చిల పాస్టర్‌లు

క్రైం కార్నర్

కొండపోచమ్మ ప్రాజెక్టు
కెనాల్‌లో పడి యువకుడి మృతి

● చేపలు పడుతుండగా ఘటన.. మృతుడు మధ్యప్రదేశ్ కూలీ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వర్గల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన యువకుడు కొండపోచమ్మ ప్రాజెక్ట్ కెనాల్‌లో పడి మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం సింగాయిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం చెనవాడ జిల్లా ఒసమజ్‌వాడి గ్రామానికి చెందిన అయికాస్(26) సిమెంట్ బ్రిక్స్ తయారు చేయడంలో లేబర్ పని చేస్తుంటాడు. గురువారం రాత్రి సింగాయిపల్లి గ్రామ సమీపంలోని కొండపోచమ్మ ప్రాజెక్టు కెనాల్‌లో చేపల వేట కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి నీట మునిగి మృతిచెందాడు. శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి కింద పడిన యువకుడు..
తెగిపడిన రెండు కాళ్లు


చికిత్స పొందుతున్న యువకుడు

రామచంద్రాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో ఓ యువకుడు రెండు కాళ్లు కోల్పోయిన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేలైన్‌పై శుక్రవారం చోటు చేసుకున్నది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన సలీం(31) వికారాబాద్‌లో సికింద్రాబాద్ రైలు ఎక్కాడు. రైలు తెల్లాపూర్ మీదుగా వెళుతుండగా సలీం ప్రమాదవశాత్తు రైల్లోంచి కిందపడ్డాడు. అతడి రెండు కాళ్లు పట్టాల కిందకు వెళ్లడంతో సలీం కాళ్లు తెగిపడ్డాయి. రైలు అలాగే ముందుకు సాగింది. తీవ్ర రక్తం స్రావం జరగగా, బాధితుడిని పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గడ్డి కటర్ మిషన్‌లో ఇరుక్కుని తెగిన చేతి వేళ్లు

నంగునూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలం వద్ద గడ్డి కటర్ మిషన్ లో చేతు ఇరుక్కొని నాలుగు వేళ్ళు రెండు ఇంచుల వరకు తెగిపోయిన సంఘటన నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో చోటు చేసుకుంది. ఎందుకు సంబంధించి 108 సిబ్బంది ఈఎంటి రమేశ్, పైలట్ ప్రభాకర్ తెలిపిన కథనం మేరకు పాలమాకుల గ్రామానికి చెందిన డేగల నర్సింలు అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద ఆవులకు మేత కోసం గట్టి కట్టర్ మిషన్ లో గడ్డిని వేస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అతని ఎడమ చేతి నాలుగు వేళ్ళు రెండు ఇంచుల వరకు కట్ అయిపోయాయి. ప్రమాద విషయాన్ని కుటుంబ సభ్యులు 108 కు ఫోన్ చేయడంతో ఈఎంటి రమేష్, పైలట్ ప్రభాకర్ లు సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందించి, స్థానిక సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

● దగ్ధమైన బైక్


ప్రమాదంలో కాలిపోయిన బైక్

హత్నూర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్ దగ్ధం కాగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామానికి చెందిన కాసాల చిరంజీవి, తన పల్సర్ బైక్‌పై పల్పనూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ పంపు వద్దకు వెళ్తుండగా, పల్పనూరు శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. పల్సర్ బైక్ రోడ్డుపై రాసుకుంటూ వెళ్లడంతో స్పార్క్ వచ్చి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో చిరంజీవికి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

పర్వేద పెద్దమ్మ ఆలయం చోరీ కేసులో
ఇద్దరికీ ఆరు నెలల జైలు

కోహెడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలం పర్వేద గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ చేసిన ఇద్దరు నిందితులకు శుక్రవారం ఆరు నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం కోహెడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరివేద గ్రామంలో 2024 మార్చి 8న పెద్దమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి బంగారు పుస్తెలు, వెండి వస్తువులు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ పొన్నం అంజయ్య పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి, దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన ఆలెపు శేఖర్‌ను అరెస్టు చేసి హుస్నాబాద్ కోర్టులో హాజరుపరిచారు. హుస్నాబాద్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేసు విచారించి ఇద్దరికీ 6 నెలల జైలు శిక్షను విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు. నేరస్థులను పట్టుకోవడానికి కీలకపాత్ర పోషించిన ఎస్‌ఐ అభిలాష్, కోర్టు కానిస్టేబుల్ సంజీవ్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ, ఏసీసీ సతీష్‌లు అభినందించారు.

కుంభమేళాకు వెళ్లి వస్తూ తప్పిపోయి..
నర్సాపూర్ డ్రైనేజీలో బయటపడి


డ్రైనేజీలో ఉన్న వ్యక్తిని బయటకు తీస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ తదితరులు

నర్సాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తూ నర్సాపూర్‌లో దిగి తప్పిపోగా, వారం తర్వాత డ్రైనేజీలో నుంచి బయటపడి తిరిగి కుటుంబీకుల వద్దకు చేరిన ఘటన ఇది. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. మెదక్ మండలం అవుసలపల్లికి చెందిన నాగారం మల్లేశం(56) ఆరు రోజుల క్రితం కుంభమేళాకు వెళ్లి తప్పిపోయాడు. కాగా కుంభమేళా నుంచి బస్సులో తిరిగి వస్తూ నర్సాపూర్‌లో ఈ నెల 18న దిగాడు. కాస్త మతిస్థిమితం లేని మల్లేశం కుటుంబీకులకు ఫోన్ చేసి తనను ఎవరో తరుముతున్నారని నర్సాపూర్‌లో తప్పిపోయానని చెప్పి పెట్టేశాడు. ఆ తర్వాత ఫోన్ పనిచేయకపోవడంతో కంగారు పడ్డ కుటుంబీకులు నర్సాపూర్‌కు వచ్చి పోలీసులకు సమాచారమిచ్చి పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లో వెతికారు. కాగా శుక్రవారం ఉదయం జాతీయరహదారి పక్కన అజయ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పెద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో పైకి కేవలం మనిషి చేతి వేళ్లమాత్రమే కనిపిస్తూ ఉండటంతో అక్కడే ఉన్న కొందరు అదే కాంప్లెక్స్‌లో ఉండే మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్నారు. స్థానికులతో కలిసి డ్రైనేజీపై కప్పును తొలగించి అందులో ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే డ్రైనేజీలో ఎన్నిరోజులుగా ఉన్నాడో వివరాలు తెలియ లేదు. ఎలాంటి గాయం లేకుండా బయటపడ్డాడు. అతడిని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లగా మల్లేశం అని తేలింది. కుటుంబీకులకు సమాచారం ఇచ్చి పోలీసుల సహాయంతో వారికి అప్పగించారు.

విఠల.. విఠల.. పాండురంగ

ఖేడ్ నుంచి పండరీపూర్‌కు ప్రారంభమైన మాఘవారి దిండి యాత్ర


పండరీపూర్‌కు పాదయాత్రగా బయలుదేరుతున్న కరణ్‌గజేంద్రభారతి

నారాయణఖేడ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పండరీపూర్ క్షేత్రానికి మాఘవారి కోసం శుక్రవారం నారాయణఖేడ్ నుంచి అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులతో దిండియాత్ర బయలు దేరి వెళ్లింది. ఏకాంబ పీఠాధిపతి అవదూత్ మహరాజ్ సైతం పాదయాత్రలో పాల్గొన్నారు. భక్తులు తలలపై కళశాలు, తులసీ కోటలు ఉంచి విఠల.. విఠల.. పాండురంగా అంటూ భజనలు కీర్తనల నామస్మరణతో బయలు దేరారు. ఈ యాత్ర దాదాపు 300 వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పండరీపూర్‌కు 10 రోజుల్లో చేరుకుంటుంది. పాదయాత్ర జి.హుక్రాన గ్రామానికి చేరుకోగానే ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని కరణ్‌గజేంద్ర మహరాజ్‌ను సన్మానించారు.

శంభో శివ శంభో

దుద్దెడ శంభు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎడ్ల బండ్లు

కొండపాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలం నాటి పురాతన ప్రాశస్త్యం కలిగిన దుద్దెడ శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో మొదటి రోజు గణపతి పూజతో కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మోత్సవాలలో అపూర్వఘట్టమైన శకటోత్సవం కొనసాగింది. ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, వాహనాలు తిరిగాయి. ఆలయ సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ మంచాల శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.


గుమ్మడిదలలోని కోల్డ్‌స్టోరేజ్ భవనం

వృథాగా కోల్డ్‌స్టోరేజ్


దొంగలు ఎత్తుకెళ్లిన జనరేటర్

గుమ్మడిదల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదలలో నిర్మించిన కోల్డ్ స్టోరేజీ నిరుపయోగంగా మారింది. మండల పరిధిలో కూరగాయల సాగు ఎక్కువ శాతం మంది రైతులు పండిస్తున్నారని నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.32లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో కోల్డ్ స్టోరేజ్ భవనాన్ని నిర్మించారు. దీంతో కూరగాయల పంటలను ఎక్కువ రోజులు నిల్వఉంచుకోవచ్చని, గిట్టుబాటు ధర దొరికినప్పుడు అమ్ముకోవచ్చని అనుకున్న రైతులు ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. అయితే, కోల్డ్ స్టోరేజీకి కావాల్సిన పరికరాలు కొన్ని లేకపోవడంతో ఇది వినియోగింలోకి రాలేదు. ఆ సమయంలో హార్టికల్చర్ అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీనిని వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంత రైతులు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నా లాభం లేకుండాపోయింది. ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజీ ఒకింత రేకులు ఎగిరిపోయి, గోడలకు పగుళ్లు వచ్చి శిథిలావస్థకు చేరుతుంది. కోల్డ్ స్టోరేజ్ కోసం ఏర్పాటుచేసిన కొత్త జనరేటర్ దొంగలపాలైంది. ప్రస్తుతం పండించిన పంటలకు ధర రాక, అందుబాటులో కోల్డ్‌స్టోరేజ్ లేక పంటను రోడ్లపై పారబోస్తూ, చేలలోనే పశువులకు మేతగా వేస్తున్న రైతులున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కోల్డ్‌స్టోరేజ్‌ను అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రభుత్వ పట్టింపులేక నిరుపయోగం



ఉమ్మడి రాష్ట్రంలో రైతులు బాగుండాలని, లాభాలు పొందాలని కోల్డ్‌స్టోరేజ్‌ను నిర్మిస్తే ప్రభుత్వాలు పట్టింపు లేనితనంతో నిరుపయోగంగా మారింది. హార్టికల్చర్ అధికారుల నిర్లక్ష్యంతో భవనం ప్రారంభానికే నోచుకోలేదు. ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులకు, జిల్లా వ్యవసాయ అధికారులకు అందుబాటులోకి తీసుకురావలని విన్నవించినా ప్రయోజనం లేదు. కలెక్టర్ స్పందిస్తే అందుబాటులోకి వస్తుంది.

- మద్దుల బాల్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

గుమ్మడిదలలో కూరగాయల రైతుల కోసం ఉమ్మడి రాష్ట్రంలో కోల్డ్ స్టోరేజ్ భవనం నిర్మించిన విషయం వాస్తవమే. కొన్ని కారణాలతో కోల్డ్‌స్టోరేజ్ వినియోగంలోకి రాలేదు. హార్టికల్చర్ అధికారుల సహకారంతో రైతులకు అందుబాటులోకి తీసుకరావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

- శైలజారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్, పటాన్ చెరు డివిజన్


ధర లేక రోడ్లపై పారబోసిన టమోటాలు

గణతంత్ర వేడుకలకు
పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించాలన్నారు. వివిధ శాఖల ద్వారా శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ విధానం అమలు చేయాలని, పేపర్‌పై పని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ రహిత కార్యాలయాన్ని తయారు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు.

ఓటు.. ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కు

● సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

నారాయణఖేడ్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఓటు హక్కు ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కు అని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ బాస్కర్, ప్రిన్సిపల్ మహేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యం'

నాగల్‌గిద్ద, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి చౌరస్తాలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎస్పీ రూపేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల మండలమైన నాగల్‌గిద్దను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను కూడా పరిశీలించామన్నారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఈ ప్రాంత యువకులకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బంది చేత శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఖేడ్‌ప్రాంత వాసులు అత్యధికంగా పోలీసు కొలువులను దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, ఖేడ్ డీఎస్పీ వెంకటిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మోర్గి చౌరస్తాలో పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

చెట్టు తొలగిస్తుండగా రైతు మృతి


బీరప్ప (ఫైల్)

వెల్దుర్తి, జనవరి24(ఆంధ్రజ్యోతి) : చెట్టును తొలగిస్తుండగా ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఆరెగూడెం గ్రామ శివారులోని ఓ పొలం వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్టును తొలగిస్తున్నారు. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన కొడే బీరప్ప (45)పై చెట్టు పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. బీరప్పకు భార్య సుగుణ, కుమారుడు ఉన్నారు. అలాగే చెట్టు పడడంతో ఎక్స్‌కవేటర్ ధ్వంసమైంది.

ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో
రూ.13.50 లక్షలు బురిడీ

పటాన్‌చెరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో ఓ ప్రైవేటు ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు రూ.13.50 లక్షల నగదును కుచ్చుటోపీ పెట్టిన ఉదంతం పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైంది. ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు శాంతినగర్‌లో నివాసం ఉండే నాంపల్లి సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగి కాగా, గత సంవత్సరం నవంబర్ 28న ఫెడిలిటీ ఇంటర్‌నేషనల్ గ్రూపు పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో చేరాలని ఒక లింక్‌ను పంపారు. తాము చెప్పినట్లు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని నమ్మించారు. నేరగాళ్ల గారడీ మాటలు నమ్మి అత్యాశతో పలు దఫాలుగా హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐలోని తన బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం 13,58,700 నగదును వ్యాట్సాప్ గ్రూపులో వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశాడు. అసలు, లాభాలు తన ఖాతాకు జమ చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా అటువైపు నుంచి స్పందన కరువైంది. తాము మోసపోయామని గ్రహించి గురువారం 1930 సైబర్ క్రైం సెల్‌కుఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

నేడు అమీన్‌పూర్‌లో సైబర్ నేరాల నివారణపై సదస్సు

నేడు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడా బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో సైబర్ నేరాలపై పోలీసులు పట్టణ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్‌పీ, సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తారు. సైబర్ నేరాలతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు పెద్దఎత్తున పట్టణ ప్రజలు హాజరు కావాలని కోరారు.

సర్కారు బడులకు 'ఎఫ్‌ఎల్‌ఎన్' కిట్లు

● సామర్థ్యాల మెరుగుకు బోధనోపకరణాలు సరఫరా
● సంగారెడ్డి జిల్లాకు 324 కిట్లు మంజూరు, పంపిణీ


సంగారెడ్డికి కేంద్రానికి చేరుకున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కిట్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ రెండేళ్లుగా ఎఫ్‌ఎల్‌ఎన్(తొలిమెట్టు) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. సమగ్ర శిక్ష ద్వారా ఐఐటీ గాంధీ నగర్ వారు రూపొందించిన ప్రత్యేక కిట్లను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేయగా, సంగారెడ్డి జిల్లాకు సైతం కిట్లు చేరాయి. జిల్లా వ్యాప్తంగా 1215 ప్రభుత్వ పాఠశాలలుండగా, ఇందులో సుమారు లక్షా 3 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాలను విద్యాశాఖ అమలు చేస్తూ వస్తున్నది. ఆయా కార్యక్రమాలు అమలు చేసినా విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో సామర్థ్యాలు మెరుగుపడటం లేదని విద్యాశాఖ గుర్తించి బోధనోపకరణాలతో అందించడానికి ముందుకొచ్చింది. జిల్లాలోని 290 ప్రాథమిక పాఠశాలలకు ఎఫ్‌ఎల్‌ఎన్ వండర్‌బాక్సులు, 17 కేజీబీవీలకు సైన్స్, మ్యాథ్స్ క్యూరియాసిటీ బాక్సులు అందించనున్నారు. త్వరలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖోజీ బాక్సులు అందజేయనున్నారు. ఇలా ఉండగా జిల్లాకు చేరిన 324 ఎఫ్‌ఎల్‌ఎన్ కిట్లు శుక్రవారం నుంచి ఆయా పాఠశాలలకు చేరవేశారు. కిట్లను సద్వినియోగం చేసుకుంటే సామర్థ్యాలు మెరుగుపడుతాయని, మెరుగైన ఫలితాలు వస్తాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

'ఉపాధి' ఉద్యోగులకు వేతనాలేవి?

● రెండు నెలలుగా అందని జీతాలు
● ఎఫ్‌ఏలకు మాత్రమే నెలనెలా చెల్లింపు
● మిగతా వారికి మొండిచేయి


ఉపాధి హామీ ఉద్యోగులు

జోగిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలోని ఉపాధి హామీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

మెదక్ జిల్లాలో 424 మంది ఉద్యోగులు

ఉపాధి హామీ విభాగంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా 424 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 16 మంది అసిస్టెంట్ ప్రోగ్రాం సిబ్బంది(ఏపీవో), 14 మంది ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు(ఈసీ), 48 మంది కంప్యూటర్ ఆపరేటర్లు(సీవో), 346 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్‌ఏ)లు ఉన్నారు. ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్(ఎఫ్‌టీవో)లో ప్రతీ నెలా వేతనాలను జనరేట్ చేసి పంపుతారు. తద్వారా వారందికీ వారివారి బ్యాంకు ఖాతాల్లో జీతాలు పడేవి. అయితే, ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నా డిసెంబర్ మాసం నుంచి జీతాలు వారి బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు చెల్లింపు

ఇదే విభాగంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్‌ఏ)లకు మాత్రం ప్రతీ నెలా వేతనాలు అందుతున్నాయి. ఉపాధిహామీలో ఉండే వర్క్స్ ఫండ్ నుంచి వీరికి వేతనాలు అందజేస్తారు. ప్రతీ నెలా ఎస్టిమేషన్ చార్జెస్‌లో ఇంజనీరింగ్ ఛార్జెస్ కింద కొంత మొత్తాన్ని పక్కనబెట్టి వాటిని వేతనంగా అందిస్తారు. దీంతో వారికి నెలనెలా వేతనాలు కరెక్టుగా అందుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందజేసి, తమను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని చిరుద్యోగులు వేడుకుంటున్నారు.

ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నాం



ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలను ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నాం. అయినా రావడం లేదన్న విషయం నా దృష్టికి రాలేదు. తొందరలోనే వేతనాల చెల్లింపు జరుగుతుండొచ్చు.

- జ్యోతి, మెదక్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న వివిధ ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ గురుకుల పాఠశాలల నోడల్ అధికారి దుర్గారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న గురుకుల పాఠశాలల్లోని సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు బోనఫైడ్, ఆదాయం, నివాసం, ఆధార్ కార్డు, ఫొటోలతో మీ సేవా కేంద్రాల్లో రూ.100 రుసుము చెల్లించి ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా సంస్థల ప్రవేశం కొరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష తేదీ ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పావన్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 11నుంచి 12గంటల లోపు 9959226270 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కొమురవెల్లి మండల విద్యాశాఖలో విభేదాలు !

● వివాదాస్పదమైన ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ కార్యక్రమం ● ఎంఈవోకు సమాచారమివ్వకుండానే విద్యాశాఖ డైరెక్టర్‌కు ఆహ్వానం



విద్యార్థులకు స్పోర్ట్స్ షూస్ అందజేస్తున్న విద్యాశాఖ డైరెక్టర్

చేర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖలో విబేధాలు నెలకొన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే ప్రభుత్వ విద్యాశాఖ సంబంధిత కార్యక్రమాలు ఎంఈవోకు సమాచారం అందించి, అనుమతితో చేపట్టాల్సి ఉన్నా పలువురు బేఖాతరు చేయడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం కొమురవెల్లి మండలం ఐనాపూర్ జడ్పీఎస్ఎస్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమం మండలవిద్యాశాఖలో విబేధాలకు నిదర్శనంగా నిలిచింది. అయితే సాక్షాత్తు జిల్లా విద్యాధికారి సమక్షంలోనే విబేధాలు బయటపడటం హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత విరాళాలతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూలు అందించేందుకు నిర్ణయించుకున్నారు. ఈ విషయమై కొద్దిరోజులక్రితం మెటీరియల్‌ను పాఠశాలకు తెప్పించుకున్న క్రమంలో కార్యక్రమ నిర్వహణకు తేదీ ఖరారు చేస్తామని హెచ్‌ఎం జె.శ్రీనివాస్‌రెడ్డి పలువురు ప్రముఖులకు ముందస్తుగా సమాచారం అందించారు. ఓ ఉపాధ్యాయురాలి చొరవతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డిని ఆహ్వానించడంతో శుక్రవారం ఉదయం హాజరయ్యారు. ఆయన వెంట సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి చేరుకున్నారు. అయితే పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఉన్నతాధికారి హాజరవుతున్న విషయాన్ని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎంఈవోకు తెలియపరచకపోవడంతో ముందస్తుగా చేరుకోకపోవడం చర్చనీయాంశమైంది. డైరెక్టర్ వస్తున్నారనే విషయాన్ని డీఈవో తెలిపిన అనంతరం ఎంఈవో రమేశ్ పాఠశాలకు చేరుకోవడంతో ఆయా వర్గాల మధ్య నెలకొన్న విబేధాలు డీఈవో సమక్షంలోనే వెలుగుచూశాయి. ఈ విషయం విద్యాశాఖ, ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

డీఈవో సమాచారమందిస్తేనే వెళ్లాను

ఐనాపూర్ జడ్పీఎస్ఎస్‌లో శుక్రవారం చేపట్టే కార్యక్రమం విషయాన్ని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి నాకు తెలియపరచలేదు. కానీ పాఠశాలలో జరిగే కార్యక్రమానికి విద్యాశాఖ డైరెక్టర్ వస్తున్నారని డీఈవో సమాచారం అందించడంతోనే వెళ్లాను. స్కూల్ హెచ్‌ఎం పనితీరుపై డీఈవోకు వివరించాను.

- ఎంఈవో రమేశ్

విద్యాశాఖ డైరెక్టర్ రాక అనూహ్యంగా జరిగింది

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూలు ప్రముఖులను ఆహ్వానించి పంపిణీ చేయాలనుకున్నాం. విద్యాశాఖ డైరెక్టర్ శిష్యురాలి చొరవతో ఆయన వస్తున్నారని అనుకోకుండా మెసేజ్ వచ్చింది. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి వచ్చిన కొద్దిసేపటి తరువాత ఎంఈవో రమేశ్ పాఠశాలకు వచ్చారు. ఉదయం ఎంఈవోకు కాల్ చేశాను.

శ్రీనివాస్‌రెడ్డి, ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం

డ్రంకెన్‌డ్రైవ్‌లో 27 మందికి జరిమానా.. ముగ్గురికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్/చేర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 27 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం ఆయా కోర్టుల్లో హాజరుపరచగా నిందితులందరికీ జడ్జీలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పగా, పలువురికి జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు వాహనతనిఖీలు నిర్వహించగా 8 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా రూ.19,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అందులో ఒకరికి జరిమానాతో పాటు మూడు రోజులు జైలు శిక్ష విధించారు. గజ్వేల్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇటీవల గజ్వేల్‌లోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించగా 15మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపరచగా రూ.8వేలు జరిమానా విధించారు. నిందితుల్లో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నలుగురు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడగా వారిని చేర్యాల మున్సిఫ్‌కోర్టులో సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్ ఎదుట హాజరుపరిచారు. దీంతో ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున మొత్తం నాలుగువేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చేర్యాలలో మున్సిఫ్‌కోర్టు సేవలు ప్రారంభం

చేర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిఫ్ కోర్టులో తొలిసారిగా శుక్రవారం కోర్టు సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నెల11వ తేదీన కోర్టును ప్రారంభించగా, సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రతీ శుక్రవారం సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్న విషయం విధితమే. ఈమేరకు శుక్రవారం ఉదయం జడ్జి శ్రావణియాదవ్ కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన నాలుగు డ్రంకెన్ డ్రైవ్ కేసులను జడ్జి శ్రావణియాదవ్ విచారించి నిందితులకు జరిమానా విధించారు. ఎన్నో ఒడిదుడుకులతో ఎట్టకేలకు స్థానికంగా కోర్టుసేవలు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారులో పేకాట ఆడుతున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. కుడిచెరువు సమీపంలో పేకాడుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.15,954 నగదు, 6సెల్‌ఫోన్లు, 5బైక్‌లు స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదం



కొండపాక: దుద్దెడ టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గజ్వేల్/కొండపాక, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో రోడ్డు భద్రత, నిబంధనలపై ప్రజలకు, వాహనదారులకు సంబంధిత అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. గజ్వేల్ పట్టణంలోని రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు, సెయింట్‌మెరీస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నియమాలను గూర్చి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్టోఫర్ పురుషోత్తమ్ మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కాగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్ డిపోలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో డ్రైవర్లదే కీలకపాత్ర అని తెలిపారు. డ్రైవర్లు మత్తు పదార్థాలకు, గుట్కా, జర్దా లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గత 25ఏళ్ల కాలంగా జీరో యాక్సిడెంట్ డ్రైవర్స్ మహ్మద్ మోసీన్, బి.చంద్రయ్య, అలాగే 15ఏళ్ల నుంచి రాములు, మసూద్‌మీరా, నర్సింలు జాగ్రత్తగా బస్సులు నడుపుతున్నారని డిపో మేనేజర్ పావన్‌కుమార్ అభినందిస్తూ వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బాబునాయక్, ఎఎంఎఫ్ జమీల్, డిపో సిబ్బంది ఉన్నారు. కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై హెచ్‌కేఆర్ టోల్ ప్లాజా వద్ద టోల్ ప్లాజా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంవీఐ శంకర్ నారాయణ మాట్లాడుతూ రోడ్డు భద్రత, నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

కార్యక్రమంలో డీటీవో కొండలరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, టోల్ ప్లాజా మేనేజర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా దుద్దెడ టోల్ ప్లాజాలో కొండపాక పీహెచ్‌సి వైద్యులు డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

పాఠశాలకు రూ.1.50 లక్షల విలువైన పరికరాల వితరణ

ములుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ సంతోష్ కోరాటి కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు ప్రాథమిక పాఠశాలకు మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ ఐడీబీఐ బ్యాంక్ వారు రూ.1.50 లక్షల విలువ చేసే కంప్యూటర్, వాటర్‌ప్యూరిఫయర్, మైక్ సెట్, ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశారు. ఎంఈవో ఉదయభాస్కర్ మాట్లాడుతూ బ్యాంకు వారు పాఠశాలకు సహాయమందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐడీబీఐ సేల్స్ మేనేజర్ మోసిన్, కోఆర్డినేటర్ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు గమనించాలి

సిద్దిపేట రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పిల్లలు గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు గమనించాలని సిద్దిపేట రూరల్ ఏఎస్ఐ పరమేశ్వరి సూచించారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో నార్కోటిక్ డాగ్స్ తో కిరాణాదుకాణాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ పరమేశ్వరి మాట్లాడుతూ గంజాయి, నిషేదిత మత్తు పదార్థాల పై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే, లేదా విక్రయించినా వెంటనే డయల్ 100కు లేదా తెలంగాణ యాంటీ నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908, సిద్దిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు ప్రవీణ్ కుమార్, కరుణాకర్, సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో బడి బయట పిల్లల గుర్తింపు



బడి బయట పిల్లలను బడిలో చేర్పిస్తున్న సీఆర్పీ

సిద్దిపేట రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను స్థానిక పౌల్ట్రీ ఫాంలో గుర్తించినట్టు సీఆర్పీ సురగోని మహేష్ తెలిపారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామంలోని పౌల్ట్రీ ఫాంలో కూలీలకు చెందిన 9 మంది పిల్లలను గుర్తించి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మల్యాల గ్రామంలో ఉన్న పౌల్ట్రీ ఫాంలలో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కూలీల పిల్లలు చదువుకు దూరంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్తే పిల్లలు ఖాళీగా ఉంటున్నారని గుర్తించి, పిల్లలను చదువుపై దృష్టి సారించాలని వారి తల్లిదండ్రులను కోరారు.

పిల్లలతో పని చేయిస్తే చట్టపరమైన చర్యలు

రాయపోల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడికి పంపించకుండా పనుల్లోకి పంపిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ భాస్కర్, ఎంఈవో సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామంలో పిల్లలు బడికి పోకుండా ఇంటివద్ద ఉంటున్నారని తెలుసుకుని అధికారులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పిల్లలను బడికి పంపించడంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ భానుప్రకాష్, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, సౌమ్య, రాజగోపాల్‌రెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమేష్, లేబర్ ఆఫీసర్ జ్యోతి పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి

గజ్వేల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. 3వ వార్డులో రూ.40లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన వెంట మునిసిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి-కనకయ్య, నాయకులు మల్లేశం, రమేశ్, విఠల్, వార్డు ప్రజలు ఉన్నారు.

విద్యార్థులు చదువుకుంటేనే మంచి భవిష్యత్

జగదేవ్‌పూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించాలని ప్రాథమిక విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సాయంత్రం నాలుగు గంటలకు పాఠశాలకు చేరుకొని 6 గంటల వరకు పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి చదువు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సరోజ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గజ్వేల్‌కు చేరుకున్న అమరుల జ్యోతి యాత్ర

గజ్వేల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో శనివారం నుంచి నాలుగురోజులపాటు నిర్వహించనున్న సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎంపార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందపోయిన ఎల్లయ్య తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో మరణించిన బైరాన్‌పల్లి అమరుల జ్యోతి శుక్రవారం బైరాన్‌పల్లి నుంచి గజ్వేల్‌కు చేరుకున్న సందర్భంగా పట్టణంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ శనివారం నిర్వహించనున్న భారీ బహిరంగసభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రముఖులు పాల్గొనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, రంజిత్ రెడ్డి, సంజీవులు, ప్రవీణ్, భరత్, సీపీఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో జాతీయ బాలికాదినోత్సవం



సిద్దిపేటలో ర్యాలీ చేపట్టిన క్రాంతి స్కూలు విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్/చేర్యాల/హుస్నాబాద్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికాదినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలో క్రాంతి హైస్కూలు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. సేవ్ గర్ల్ చైల్డ్ అని నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేఆర్ చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడిన తర్వాత స్కూలు చైర్మన్ అర్పిత రెడ్డి, ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ బాలికల విద్య అవశ్యకత, సాధికారతపై అవగాహన కల్పించారు. చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో శుక్రవారం మై భారత్, నెహ్రూ యువకేంద్రం సహకారంతో గుర్జకుంట వివేకానంద వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించుకుందాం అంటూ నినాదాలు చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలిక దినోత్సవం సందర్భంగా భారత దేశంలో మహిళల స్థితిగతులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో స్త్రీ విద్య ప్రధాన పాత్ర పోషిస్తుందని, స్త్రీలు విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. మహిళల వికాసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిని వివరించారు. సమావేశంలో రిసోర్స్‌పర్సన్ బాలరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి నయనాదేవి, సబి ఫాతిమా, చంద్రమౌళి, విజయ, అనిత, రాజ్యలక్ష్మీ, పరశురామ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిన్నకోడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని పెద్దకోడూరు గ్రామంలో గురువారం రాత్రి ప్రజలను సైబర్‌నేరాలపై చైతన్య పరిచేవిధంగా కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీసు కళా బృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు ప్రజలకు మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, మంత్రాలు తదితర మూఢ నమ్మకాలపై నాటకం, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

హామీలను అమలు చేయాలని నిరసన

హుస్నాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. హామీలను అమలు చేయాలని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది గడిచినా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అర్హులకు ఇవ్వని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి అన్వర్, నాయకులు శంకర్‌రెడ్డి, పూదరి రవీందర్, థామస్, సతీష్, రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

బి స్మాట్ జనరల్ సెక్రటరీగా జగ్గు మల్లారెడ్డి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తుర్కయాంజల్ వేదికగా నూతనంగా ఏర్పాటైన బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బి స్మాట్) సంఘానికి జగ్గు మల్లారెడ్డి స్టేట్ జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రైవేట్ విద్యాసంస్థల టీచర్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సమక్షంలో నూతన సంఘం, కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్టేట్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైనా జగ్గు మల్లారెడ్డికి జిల్లా ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు అభినందనలు తెలిపారు

మహాదీక్షను విజయవంతం చేయాలి : జేఏసీ చైర్మన్

చేర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వతేదీన చేర్యాల అంగడి బజారు చౌరస్తాలో చేపట్టనున్న మహాదీక్షను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు కోరారు. చేర్యాల పట్టణంతో పాటు కొమురవెల్లి మండలకేంద్రాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాలలో మహాదీక్ష కరపత్రాలు విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రెవిన్యూ డివిజన్‌తోనే చేర్యాల పునర్వైభవం సంతరించుకుంటుందని, ఈప్రాంత ప్రజల సమస్యలు తీరతాయన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా చిరకాలస్వప్నాన్ని నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డివిజన్ సాధించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల జేఏసీ నాయకులు బూరుగు సురేశ్, పుర్మ వెంకట్‌రెడ్డి, ఒగ్గు రాజు, శెట్టిపల్లి సత్తిరెడ్డి, ముస్త్యాల బాలనర్సయ్య, రాళ్లబండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇవ్వకుండా.. అనర్హుల పేర్లా?

● సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు లేవంటూ పలు గ్రామసభల్లో గందరగోళం... అధికారులపై ఆగ్రహం





మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు, చేర్యాల మండలం కడవేరుగులో అధికారులను నిలదీస్తున్న స్థానికులు

సిద్దిపేట రూరల్/గజ్వేల్/చిన్నకోడూరు/వర్గల్/చేర్యాల/హుస్నాబాద్‌రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలు నిర్వహించగా పలు గ్రామాల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులను ఎంపిక చేసి తమను మరిచిపోవడమేంటని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల, బచ్చాయిపల్లి, రాంపూర్‌తో పాటు నారాయణరావుపేట మండల కేంద్రంలో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు లబ్ధిదారుల జాబితా చదువుతున్న సమయంలో అర్హులైన వారి పేర్లు జాబితాలో రాలేదని, గృహలక్ష్మి ప్రొసీడింగ్ ఉన్న వారి పేర్లు జాబితాలో లేవంటూ అధికారులను నిలదీశారు. దీంతో కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల గొడవను సద్దుమణిగించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 18వ వారు సభలో మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించారు మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో లిస్టులో అనర్హుల పేర్లు రావడం పట్ల స్థానికులు అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. అర్హులైన లబ్ధిదారులు తిరిగి దరఖాస్తును చేసుకోవాలని అధికారులు చెప్పడంతో గొడవసద్దుమణిగింది. చిన్నకోడూరు మండలంలోని మల్లారం, ఎల్లమ్మజాలు, శంకరాయకుంట, కమ్మర్లపల్లి గ్రామాల్లో ప్రకటించిన జాబితాల్లో తమ పేర్లు రాలేదని పలువురు అభ్యంతరం తెలుపగా, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని వారికి అధికారులు సూచించారు. వర్గల్ మండల కేంద్రంతో పాటు మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన గ్రామసభలకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ రైతు భరోసా అందజేయనున్నట్లు తెలిపారు. చేర్యాల మండలం కడవేరుగు, పెద్ద రాజుపేట గ్రామాల్లో గ్రామసభలు రసాభాసగా మారాయి. జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని, తమకు అన్యాయం చేస్తున్నారని పేర్కొంటూ పలువురు స్థానికులు అధికారులను నిలదీశారు.

ఆయా అంశాలపై బీఆర్ఎస్ నాయకులు వారికి అండగా నిలిచారు. కడవేరుగు గ్రామంలో నిలదీతలపర్వం కొనసాగుతుండటంతో అధికారులు వెళ్లిపోయారు. హుస్నాబాద్ మండలం పొట్లపల్లి, మహ్మదాపూర్ తదితర గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులను గ్రామస్థులు నిలదీశారు అర్హత ఉండి జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వారికి సూచించారు.

లెక్క తేల్చడమే తరువాయి

(5వ పేజీ తరువాయి)

ఈ పథకానికి గానూ శనివారం వరకు పూర్తిస్థాయిలో ఓ అంచనాకు వచ్చి అర్హుల నివేదికను అధికారులు సిద్ధం చేయనున్నారు.

ముగిసిన గ్రామ, వార్డు సభలు

సంక్షేమ పథకాల కోసం నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామ, వార్డు సభలు శుక్రవారంతో ముగిశాయి. నాలుగు రోజులుగా సభలలో హోరెత్తిన నిరసనలు చివరి రోజు శుక్రవారం అక్కడక్కడా నిరసనలు, అర్హులైన జాబితా వారి పేర్ల మీద అధికారులతో కొనసాగిన వాగ్వాదాలు, పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదాలు కొనసాగాయి. జిల్లాలో పలుచోట్ల గ్రామ బహిష్కరణలు జరగ్గా వాటిపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నాలుగు రోజల పాటు కొనసాగిన గ్రామ, వార్డు సభలు శుక్రవారం ముగియడంతో అధికారులు, పోలీసులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

జాబితాలో పేరు రాలేదని సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు రాలేదని ఓ యువకుడు దుబ్బాకలో సెల్ టవర్ ఎక్కి దూకేస్తానంటూ హల్‌చల్ చేశాడు. లచ్చపేట 11వ వార్డుకు చెందిన మామిడాల రాజు అనే యువకుడు గురువారం జరిగిన వార్డు సభలో ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడ ఆశించిన రీతిలో అధికారుల నుంచి స్పందన కరువవ్వడంతో, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హుడినైనా తనకు అన్యాయం జరిగిందని భావించి నిరుత్సాహంతో శుక్రవారం దుబ్బాకలోని అంగడిబజార్‌లో సెల్ టవర్ ఎక్కి పైనుంచి దూకేస్తానని బెదిరించాడు. సమాచారమందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు, లచ్చపేట వార్డు ప్రజలు అక్కడికి చేరుకుని రాజుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ చేరుకొని, మరోసారి పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలించి, తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రాజు కిందికి దిగాడు.

క్రికెట్ టోర్నీని విజయవంతం చేయాలి

● తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గజ్వేల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీని విజయవంతం చేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 26 నుంచి స్థానిక ఐవోసీ గ్రౌండ్స్‌లో సిద్దిపేట జిల్లాస్థాయి తెలంగాణ గోల్డ్ కప్-2025 క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొంటాయనితెలిపారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఈ టోర్నీ నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటిబహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేల నగదు అందిస్తున్నామన్నారు.

రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ములుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం యాదగిరి కోరారు. శుక్రవారం డ్వాక్రా మహిళాసంఘం కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తక్కువ వడ్డీతో సంఘ సభ్యులు రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.